క్లుప్తంగా

కలెక్టర్‌కు మంత్రి, ఎంపీ శుభాకాంక్షలు



సాక్షి అమలాపురం: రాష్ట్ర రవాణా శాఖ పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనూరాధలు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడంతోపాటు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు.

వెంకన్న క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం 2023 సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్‌ను మంత్రి పినిపే విశ్వరూప్ స్వామి సన్నిధిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు ఆధ్వర్యంలో మంత్రి తనయుడు డాక్టర్ శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ యువజన అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, భరణికాన బాబు, సంసాని అబ్బు, ముంగర ప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ నాయుడుకు సత్కారం




కమిషనర్ నాయుడును సత్కరిస్తున్న జిల్లా చేతి వృత్తుల సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడిను శుక్రవారం ఉదయం సత్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ కమిషనర్ నాయుడు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాల అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం సంఘం తరఫున కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సంఘ ప్రతినిధులు షేక్ కరిముల్లా బాబా, మోర్త శ్యామ్, బొక్కా రామకృష్ణ, పాటి వెంకటరామయ్య, మట్టపర్తి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక వంటెద్దు వారి వీధిలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. బాధిత చిన్నారులకు జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు ఈ కిట్లు అందజేశారు. వంటెద్దు వెంకన్నాయుడు, కె.రిష్విక్, సీహెచ్ ప్రసన్న, జి.చంద్రశేఖర్, వి.విజేత, జల్లి సూజాత ఈ పౌష్టికాహారాన్ని సమకూర్చారు.

బియ్యం కార్డులు అందజేత



రైసు కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన రైస్ కార్డులను సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి పంపిణీ చేశారు. గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మట్టపర్తి షణ్ముఖరావు, పాలకవర్గ సభ్యులు దొమ్మేటి శివస్వామి, కర్రి భవాని, ఓలేటి పరమేష్, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, వీఆర్‌ఓ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం: మండలంలో చల్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లను ఆనుకొని ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్నందుకు నేడు పలు చోట్ల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ రవి కుమార్ శుక్రవారం తెలిపారు. చల్లపల్లి, వాసాల తిప్ప, నక్కా రామేశ్వరం గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండదని రవికుమార్ అన్నారు.

హెచ్ఎంకు సత్కారం

అమలాపురం రూరల్: చిందాడగరువుకు చెందిన జేజే రావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవం సందర్భంగా అమలాపురం సూర్యనగర్‌లోని గోపాలకృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శిరోమణిని ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత ఎంఈవో జంగా రాజేంద్రకుమార్ సత్కరించారు. ట్రస్ట్ కార్యదర్శి దాకే వెంకట్రావు, ఉపాధ్యక్షులు కోట బాలకృష్ణ పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను దీవించండి

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- క్రాపచింతలపూడిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

ముమ్మిడివరం: దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌ను దీవించాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. మండలంలో క్రాపచింతలపూడిపాలెంలో ఆయన గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడంలేదా..అని ఆరా తీశారు. మహిళలు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, చేయూత, వసతిదీవెన, వైఎస్సార్ పింఛన్ కానుక, విద్యాదీవెన, అమ్మఒడి, ఇంటి స్థలం వంటి పథకాలతో లక్షలాది రూపాయాల లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేశారు. పేదలమైన తమకు సాయం చేస్తున్న ఈ ప్రభుత్వం కలకాలం ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో పింఛన్లు పెంపు ద్వారా ముఖ్యమంత్రి జగన్ అవ్వాతాతలకు సంక్రాంతి కానుక అందించారని అన్నారు. జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలాగంగాభవాని, రాష్ట్ర కార్యదర్శి వేగిరౌతు రాజబాబు, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం (బాబ్జీ), రాయపురెడ్డి జానకిరామయ్య, దొమ్మేటి అప్పారావు, శ్రీనురాజు, రాయపురెడ్డి వెంకటస్వామి, సర్పంచ్ మట్టపర్తి సత్యనారాయణ, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తదితరులు

మళ్లీ వస్తే మరిన్ని పథకాలు

- జగన్‌ను సీఎంని చేసుకుందాం
- మంత్రి పినిపే విశ్వరూప్
- గుండెపూడిలో గడపగడపకూ

అల్లవరం: గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో సమస్యలను, ప్రజల మౌలిక అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటామని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గుండెపూడిలో నోడల్ అధికారి, ఎంపీడీఓ సరోవరరావు ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి నేటి వరకు అందించిన వివిధ పథకాలపై లబ్ధిదారుకు అందించిన సంక్షేమ పథకాలను మంత్రి విశ్వరూప్ ఇంటింటా వివరించారు. సంక్షేమ పథకాలు వర్తించని కుటుంబాలను గుర్తించి వారికి పథకాలు అమలయ్యేలా చొరవ తీసుకుంటున్నట్టు మంత్రి అన్నారు. గృహ రుణాలు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారని, ఈ విషయంపై సీఎంతో చర్చిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ప్రస్తుతం అమల్లో ఉన్న సంక్షేమ పథకాలు నిర్విరామంగా సాగుతాయని, మరిన్ని కొత్త పథకాలు ఆచరణలో తీసుకొస్తారన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ గుంటూరి కృష్ణంరాజు, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటూరి బాలరాజు, పినిపే ప్రకాశరావు, కొపనాతి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, పార్టీ నాయకులు, అభిమానులు, పాల్గొన్నారు.



సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారుకు వివరిస్తున్న మంత్రి విశ్వరూప్

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- 355 కొత్త పింఛన్లు అందజేత

ఐ.పోలవరం: అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ పింఛను కానుక పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్టకాలంలోనూ ఇచ్చిన మాట ప్రకారం ఏటా పింఛను పెంచుతూ లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం జగన్ ఒక్కరే అని అన్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో 355 మందికి ఒక్కక్కరికీ రూ.2,750 నూతన పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, వైస్ ఎంపీపీలు పిన్నంరాజు బాబ్జి రాజు, తోట మాణిక్యం, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, కాటం సత్తిరాజు, పెమ్మాడి బాబూరావు, నల్లా సుదర్శన్, సొసైటీ అధ్యక్షులు, దేవస్థాన చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



ఐ.పోలవరంలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్

ఉప్పలగుప్తంలో..

ఉప్పలగుప్తం: మండలంలో పలు గ్రామాల్లో సర్పంచ్‌లు లబ్ధిదారులకు శుక్రవారం పెన్షన్లు అందజేశారు. విలసవిల్లిలో కొత్తగా మంజూరైన 21 పెన్షన్లను సర్పంచ్ ఊర్మిళాదేవి, ఎంపీడీవో కె.ఎస్ గౌరీకుమారి అందించారు. ఉప్పలగుప్తంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు 28 పెన్షన్లను, భీమనపల్లి సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్ 28 పెన్షన్లను అందించారు. ఎంపీటీసీలు చిక్కం త్రినాథ్, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, చీకట్ల రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గట్ల పరిశీలన

కాట్రేనికోన: సముద్రపు నీరు పంట చేలను ముంచెత్తడంతో రైతుల ఫిర్యాదులపై ఉన్నతాధికారులు ఆదేశాలతో రెవెన్యూ, ఇరిగేషన్, అటవీశాఖ అధికారుల బృందం శుక్రవారం కాట్రేనికోనలో రక్షణ గట్లను పరిశీలించారు. మండలంలో కూనవరం స్ట్రైట్ కట్, కొత్తకాలెం గండి, పొన్నాడ వారి గట్టు వద్ద రక్షణ గట్టును పరిశీలించారు. రక్షణ గట్టు పనులను ఆధునీకరించి, స్లూయిజ్‌లు నిర్మించాల్సి ఉందని గుర్తించారు. బ్రహ్మసమేధ్యం నుంచి కూనవరం స్ట్రైట్ కట్ వరకు, రాఘవుల పేట వంతెన వరకు పనులు చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు, ఇరిగేషన్ ఈఈ డీవీ రామ్‌గోపాల్, తహసీల్దార్ బీఎం రావు, డీఈఈ టి.శ్రీనివాస్, ఏఈ శివ రామకృష్ణ తదితరులు ఉన్నారు.



కొత్తపాలెం గండి ప్రాంతంలో రక్షణ గట్టు, స్లూయిజ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

హేమ శ్రీనివాస్ సేవలు అభినందనీయం



సేకరించిన సొమ్మును విద్యార్థి ద్వారా హెచ్ఎంకు అందచేస్తున్న హేమ శ్రీనివాస్

కాట్రేనికోన: పేద విద్యార్థుల పట్ల సేవాభావం కల సేవకుడు హేమ శ్రీనివాస్ అని ఎంఈఓ రమణశ్రీ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు లంకే హేమ శ్రీనివాస్ చెంచు విద్యార్థుల జీవన విధానంపై చలించి వారికి సాయం అందించాలన్న తపనతో ఫేస్‌బుక్‌లో చెంచుల కోసం ఒక్క రూపాయి సాయం చేయాలని పోస్ట్ పెట్టారు. ఈ పోస్టుకు స్పందించిన కొందరు స్నేహితులు రూ.31,687 ఆయన ఖాతాకు జమచేశారు. దీనితో సహచర ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులకు శానిటేషన్ కిట్లను అందజేశారు. మిగిలిన సొమ్ము రూ.18,227లు స్కూల్ పేరున ఎకౌంట్‌లో జమచేసి ఎంఈఓకు అందచేశారు.

ప్రవాస భారతీయ విద్యావేత్త సత్యనారాయణ మృతి



సత్యనారాయణ (ఫైల్)

అల్లవరం: అమెరికాలోని టెక్సాస్‌లోని మిడ్ వెస్టన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓడలరేవు గ్రామానికి చెందిన డాక్టర్ అయినగడ్డ సత్యనారాయణ స్వగ్రామంలో గురువారం గుండెపోటుతో మృతి చెందారు. నెల రోజుల క్రితం శీతాకాల సెలవులు నిమిత్తం ఇక్కడకు వచ్చారు. గురువారం ఉదయం ఆయనకు గుండెపోటు రాగా కుటుంబ సభ్యులు అమలాపురంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారని ఆయన బావమరిది పాల వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఓడలరేవులో ప్రాథమిక విద్యను అభ్యసించిన ఆయన ఇండియా, కెనడా, అమెరికా దేశాల్లో పీహెచ్‌డీలు పొందారని తెలిపారు. యూఎస్ఏ టెక్సాస్ రాష్ట్రంలో కాలేజీ అకాడమిక్ సిలబస్‌ను తయారుచేయడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ, కెనడా అట్టావా యూనివర్సిటీలో స్వర్ణ పతకాలు సాధించారన్నారు. ఆయన మృతికి మిడ్ వెస్టన్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. గ్రామస్తులు, విద్యావేత్తలు, అమలాపురం అగ్నికులక్షత్రియ సంఘం సంతాపం వ్యక్తం చేశారు.

వెబ్‌నరీ లైబ్రరీ ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలో సమత మూమెంట్ కన్వీనర్ తెన్నేటి మోజేస్ ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయోద్యమానికి సంబంధించి అలనాటి నేతలు రాసిన గ్రంథాల, పుస్తకాలను నిక్షిప్తం చేసేందుకు వెబనరీ లైబ్రరీ (స్టూడియో)ని ఏర్పాటుచేశారు. రాష్ట్ర మాదిగ సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు, రచయిత పి.కృపాకర మాదిగ ఈ లైబ్రేరీని శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. తొలుత ఆయన భారత మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాను రచించిన «పంచుకుందాం రా» (బహుజన కావ్యం) పుస్తకాన్ని ముఖ్య అతిథి కృపాకర మాదిగ లైబ్రేరీకి బహూకరించారు. మోజేష్ ప్రసాద్ మాట్లాడుతూ జాతీయోద్యమానికి సంబంధించి పుస్తకాలు కావలసిన వారికి ఇస్తామని, అలాగే జాతి ప్రయోజనాలతో ముడిపడిన పుస్తకాలను ఎవరిచ్చినా లైబ్రరీలో ఉంచుతామని పేర్కొన్నారు. సమత మూమెంట్ అధ్యక్షురాలు ఆకుమర్తి కోకిలతో పాటు జిల్లాకు చెందిన ఎమార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



వెబ్‌నరీ లైబ్రరీని ప్రారంభిస్తున్న కృపాకర మాదిగ

వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలి

అమలాపురం రూరల్: వైద్య ఆరోగ్య సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.దుర్గారావు దొర వైద్య సిబ్బందిని ఆదేశించారు. పేరూరు పీహెచ్‌సీ పరిధిలో కామనగరువు పంచాయతీలో ప్రతి శుక్రవారం జరిగే డ్రైడే ఫ్రైడేలో భాగంగా పితానివారిపాలెంలో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అంగనవాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పోషకాహారంపై పలు సూచనలు ఇచ్చారు. స్వయం సహాయక గ్రూపులు, గర్భిణులు, బాలింతలకు రక్త హీనతపై అవగాహన కల్పించాలని అన్నారు.



కామనగరువు పితానివారిపాలెంలో డ్రైడే సూచనలు ఇస్తున్న జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘంలో అమలాపురానికి స్థానం



సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావుతో అమలాపురం సర్పంచ్‌లు తదితరులు

అమలాపురం రూరల్: రాష్ట్ర సర్పంచ్‌ల"ససంక్షేమ సంఘం కార్యవర్గంలో అమలాపురం నియోజకవర్గానికి చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. విజయవాడ రాఘవయ్య పార్క్ వద్ద ఎంబీ విజ్ఞాన్ కేంద్రంలో జరిగిన ఈ సంఘం సమావేశంలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా చిలకలపూడి పాపారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే బండారులంక సర్పంచ్ పెనుమాల సునీత, ఉప్పలగుప్తం మండలం భీమపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని శుక్రవారం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణ కుమారి, సర్పంచ్‌లు దాసరి అరుణకుమారి, చొల్లంగి శివాని తదితరులు అభినందించారు.

ముగింపు దశలో అనురాధ ప్రీమియర్ లీగ్



క్రీడాకారులతో ఎంపీ అనురాధ

అమలాపురం రూరల్: ఓఎన్జీసీ సౌజన్యం ఇమ్మాన్యుయెల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురంలోని కిమ్స్ కళాశాల మైదానంలో జరుగుతున్న అనురాధ ప్రీమియర్ లీగ్ ముగింపు దశకు చేరింది. డిసెంబర్ 26 నుంచి ఈ టోర్నీ సాగుతోంది. ఆదివారం ఫైనల్స్ జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి తదితరులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

నిత్యావసరాల వితరణ

అమలాపురం టౌన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుని సంస్మరణార్థం అతని స్నేహితులు దివ్యాంగులకు నిత్యావసరాలు, కూరగాయలు వితరణ చేశారు. రూరల్ మండలం పేరూరుకు చెందిన పిల్లా శ్రీనివాస్ మృతికి అతని స్నేహితులు 15 మంది కలసి ఫ్రీ టైమ్ సర్వీస్ (ఎఫ్‌టీఎస్) ఫౌండేషన్ ద్వారా ఫ్రీ గ్రోసరీ ప్రాజెక్ట్ కింద ఈ నిత్యావసర వస్తువుల కిట్లను స్థానిక సత్యసాయి కళ్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం దివ్యాంగులకు అందించారు.



దివ్యాంగులతో ఎఫ్‌టీఎస్ ప్రతినిధులు



ప్రజా ఉత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మీనారాయణ, చిత్రంలో మల్లాడి, అధికారులు



అలరించిన కూచిపూడి నృత్యం

సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత

- ఘనంగా ప్రజా ఉత్సవాల ప్రారంభం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

యానాం: సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత అని, 19 ఏళ్లగా నిర్వహిస్తున్న యానాం ప్రజా ఉత్సవాలు నిర్విరామంగా నిర్వహించడం అభినందనీయమని పుదుచ్చేరి పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో 19వ యానాం ప్రజా ఉత్సవాలను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పుదుచ్చేరి ప్రభుత్వ ప్రగతిని వివరించారు. మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ 21 ఏళ్ల క్రితం ప్రజా ఉత్సవాలను తాను ప్రారంభించినట్టు వివరించారు. అంతకు ముందు ముఖ్య అతిథులను సత్కరించారు. ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కూచిపూడి నృత్యాలు, మాల్లుడి శుభ పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో మట్టపర్తి నూకరాజు, బాలేశ్వరి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ విళ్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

అమలాపురం టౌన్: మన్నా ఫుల్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో స్థానిక నల్లవంతెన వద్ద మిరియం గ్రౌండ్‌లో మన్నా మహోత్సవాలు జరుగుతాయని ఆ మినిస్ట్రీస్ కార్యదర్శి, జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కారల్ డేవిడ్ కొమానపల్లి (లాల్) తెలిపారు. స్థానిక మిరియాం క్యాంపస్‌లో ఈ మహోత్సవాల వాల్‌పోస్టర్లు, కర పత్రాలను లాల్ శుక్రవారం విడుదల చేశారు. రెవరెండ్ ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేర్ తాతపూడి, రెవరెండ్ పి.కృపానందం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నారాయణ యజ్ఞం



లక్ష్మీ నారాయణ యజ్ఞాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అమలాపురం టౌన్: అమలాపురంలో ఆధ్యాత్మిక బస చేసిన భీమవరం భాష్యకార పీఠాధిపతి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో శ్రీలక్ష్మీ నారాయణ యజ్ఞం నిర్వహించారు. అనంతరం జరిగిన అన్న ప్రసాద వితరణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ ప్రతినిధులు భక్తులకు సేవలు అందించారు.

వెంకటేశ్వరస్వామి కళ్యాణం..

స్థానిక యెండూరి ప్లాజాలో టీటీడీ ఆస్థాన పండితులు వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పట్టణ వైశ్య సంఘం ప్రతినిధులు యెండూరి సోదరులు నాగేశ్వరరావు, వెంకటాచలం దంపతులచే స్వామి కళ్యాణం జరిగింది.

ఘనంగా రుద్ర, చండీహోమాలు



చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రుద్ర, చండీ హోమాలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పౌర్ణమి తిథి, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైల్వే పనులపై కలెక్టర్‌కు వినతి

అమలాపురం టౌన్: కోనసీమ రైల్వే నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్ఎస్ఎస్) ప్రతినిధుల బృందం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను శుక్రవారం కలసి వినతి పత్రం అందించింది. ఈ పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కేఆర్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వారు కలెక్టర్‌ను కలిశారు. రైల్వే వంతెనలకు సంబంధించి మిగితా స్థల సేకరణ త్వరలో చేపడతామని కలెక్టర్ ఆ బృందానికి వివరించారు. కేఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కుడుపూడి సూర్యనారాయణరావు, కల్వకొలను తాతాజీ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

డ్రైనేజి నిర్మాణానికి శంకుస్థాపన

అమలాపురం రూరల్: బండారులంక పరిధి చిన చంద్రపురంలో మండల ప్రజా పరిషత్ నిధులతో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. సరెళ్ల రామకృష్ణ ఎంపీటీసీ సభ్యులు కామిశెట్టి కుసుమ, అంకం హిమ భారతి తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లతో అదనపు ఆదాయం



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

కాట్రేనికోన: పెరటి కోళ్ల పెంపకంతో మహిళలకు అదనపు ఆదాయం చేకూరుతుందని జెడ్పీటీసీ నేల కిశోర్ కుమార్ అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఏపీఓ వెంకటేశ్వరరావు అధ్యక్షతన పెరటి కోళ్ల పంపిణీ జరిగింది. మండలంలో సుమారు 100 యూనిట్లను మహిళలకు అందజేశారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బడుగు రోజా మాట్లాడుతూ ప్రతి యూనిట్‌లో పది కోడి పెట్టలు, 5 కోడి పుంజులు, నెట్, కోళ్ల దాణా ఇస్తారని, దీనితో మహిళలకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. సర్పంచి గంటి వెంకట సుధాకర్, నల్లా నరసింహమూర్తి, మోకా చంద్ర నాగరత్నం, సంసాని నాగేశ్వరరావు, మోకా అప్పాజి, జగడం బాలయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు టెస్ట్ మెటీరియల్

ఉప్పలగుప్తం: మండల పరిధి చల్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు మండల వ్యాప్తంగా ఉన్న 8 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 600 మంది విద్యార్థులకు టెస్ట్ పేపర్‌తో కూడిన మెటీరియల్‌ను సమకూర్చారు. యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఈ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, ఎంఈవో కె.కిరణ్ బాబు, హెచ్ఎం ఎల్.రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై స్పందించాలి

అమలాపురం టౌన్: ఎస్టీయూ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి శివ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. సాయి శ్రీనివాస్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.